క్లుప్తంగా

మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు





జనగామ: రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖను మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ లకావత్ ధన్వంతి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన టీఎన్జీఓ సంఘం నాయకులు



దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను జనగామ టీఎన్జీఓ యూనియన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం సచివాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ ఆధ్వర్యంలో ఆమెను కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తారని తెలియజేశామన్నారు. జిల్లాలో ఉద్యోగులతో కలిసి నిర్వహించే స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి రావాలని మంత్రికి ఆహ్వానం అందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి ఎండి హఫీజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత రామనర్సయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి సాంబారి నాగార్జున్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



బచ్చన్నపేట: మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, పొక్లెయినర్‌ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఎలాంటి అనుమతులు లేకుండా ఎద్దుగూడెం సమీపం ఓ వ్యవసాయ బావి వద్ద నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయినర్‌ని ఎస్సై కంకల సతీష్ ఆధ్వర్యంలో పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వాటిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ సుమన్, ఆర్ఐ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గ్రామ సఫాయి అదృశ్యం


యాదయ్య

బచ్చన్నపేట: కట్కూర్ గ్రామ పంచాయతీలో నాన్ మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న తుడుం యాదయ్య (60) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన యాదయ్య రాత్రి వరకు తిరిగి రాలేదని, ఉదయం గ్రామంలో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

యువతికి గాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ బస్సు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శివునిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. శివునిపల్లికి చెందిన గోరంటల నాగరాణి బమ్మెరలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్ సమీపాన బస్‌స్టేజీ వద్దకు వచ్చింది. హనుమకొండ నుంచి పాలకుర్తికి వెళ్లే ఆర్టీసీ ప్రైవేట్ బస్సు ఎక్కుతుండగా బస్సు ముందుకు కదలడంతో నాగరాణి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు గాయమైంది. అయితే డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లాడు. యువతికి స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యంకోసం హనుమకొండకు తరలించారు. కాగా, బస్సు పాలకుర్తి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు బస్సును శివునిపల్లిలో ఆపి విషయాన్ని పోలీసులకు తెలిపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ వినయ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ బాధితురాలి తండ్రి రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ


బచ్చన్నపేట: అక్షింతల పంపిణీలో మండల సంయోజక్ రాజయ్య


కొడకండ్ల: రామవరంలో..


చిల్పూరులో..


పాలకుర్తిటౌన్: హర్యా తండాలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అయోధ్య పూజిత అక్షింతలను గడప గడపకు మంగళవారం పంపిణీ చేశారు. ముందుగా ఆయా గ్రామాల ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పడుతూ భజనలు చేస్తూ ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల సంయోజక్ కొత్తపల్లి రాజయ్య మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభం సందర్భంగా ప్రతి గ్రామంలో ఇంటిపై జై శ్రీరాం జెండాలను ఎగురవేయాలని కోరారు. భక్తులు దొంతుల శేఖర్, చంద్రమౌళి, పిన్న ఉపేందర్, కట్కూరి శ్రీనివాస్, బాలయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: పవిత్ర అయోధ్య రామ జన్మభూమి పూజిత అక్షింతలు మంగళవారం ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లికి చేరుకున్నాయి. స్థానిక లక్ష్మీవెంకటేశ్వర ఆలయం నుంచి రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి పాలకుర్తి రోడ్డుకు శివునిపల్లిలో వాడ వాడలా శ్రీరామభక్తులు డప్పు చప్పుళ్లతో ర్యాలీ చేపట్టారు. అనంతరం గడపగడపకు అక్షింతలను పంపిణీ చేశారు. తాత్కాలిక సర్పంచ్ బూర్ల విష్ణు, వీటీ శ్రీనివాస్, చల్లా రఘురెడ్డి, సముద్రాల ఉపేందర్, కె.శరత్‌కుమార్, శాగ సురేష్, దొంతి రాజు, గోలి రాజశేఖర్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

చిల్పూరు: మండలంలోని పలు గ్రామాల్లో రామ జన్మభూమి అక్షింతల కలశాలతో రామ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. బత్తిని శ్రీను, కేశోజు నిరంజనాచారీ, వెంకటస్వామి, ముక్కెర గోపాల్, సాదం వేణు, చిదురాల రాజేష్, వేల్పుల రాజు, జగన్, బత్తిని రమ పాల్గొన్నారు.

కొడకండ్ల: అయోధ్య అక్షింతలతో మండలంలోని రామవరంలో శోభాయత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో అయోధ్య అక్షింతలతో భక్తులు భజనలతో శోభాయాత్ర చేపట్టి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. సర్పంచ్ మందుల శిరీష, ఎంపీటీసీ చెంచు మణెమ్మ, భజన కమిటీ చైర్మన్ సోమరాములు, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో శోభాయాత్రలో భక్తులు

పాలకుర్తి టౌన్: అయోధ్య రాముడి అక్షింతలు మల్లంపల్లి సద్గురు నిత్య నిర్మలాంద డాక్టర్ సెలువోజు చంద్రమౌళి రాజయోగి ఇంటింటికి పంపిణీ చేశారు. మండలంలోని హత్యా తండాలో అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరం ప్రతిష్ఠ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. సర్పంచ్ బానోత్ మహేందర్, గర్వందుల మల్లేష్, కొమురయ్య, లక్ష్మణ్, నెహ్రూ, బాలాజి, గిరిధర్, పీనా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ హుస్సేన్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘన్‌పూర్ టౌన్‌లో విద్యుత్ సరఫరా ఉంటుందని, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లోని తాటికొండ, ఫత్తేపూర్, మల్కాపూర్, రాజవరం, చిల్పూరు, చిన్నపెండ్యాల, నమిలిగొండ, జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు బీఆర్ఎస్ కృతజ్ఞత సభ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల కృతజ్ఞత సభను నేడు (బుధవారం) కొడవటూర్ రోడ్డులోని శ్రీనిధి గార్డెన్‌లో 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందిన తర్వాత తొలిసారి సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు జిల్లా నాయకులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఊరూరా వికసిత్ భారత్ సంకల్పయాత్ర


వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమ కోసం వివిధ పద్ధతుల్లో చేపట్టిన సంక్షేమ పథకాల వినియోగంపై ఊరూరా వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరిట వీడియో ప్రదర్శనలతో విస్తృత ప్రచారం చేపడుతోంది. మంగళవారం మండలంలోని సీతారాంపురంలో సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా 2047 నాటికి భారత దేశం సంపూర్ణ అభివృద్ధి దిశలో పయనించేందుకు కేంద్రం బ్యాంకింగ్, పోస్టాఫీస్, ఆరోగ్యం, ఉపాధి వంటి పలు కీలక శాఖల ద్వారా ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పథకాలను పీఎం మోదీ సందేశాత్మక సందేశంతో ప్రయోగాత్మకమైన వీడియోల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, యూబీఐ బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, ఉపసర్పంచ్ పాషా, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రవివర్మ, ఐకేపీ సీసీ రామచంద్రయ్య, వీఓఏ సోమలక్ష్మి ,అంగన్‌వాడీ టీచర్ సువర్ణ పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన సింగపురం ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ నియోజకవర్గంలో పరిస్థితులను ఆమెకు వివరించారు.

బాధితురాలికి పరామర్శ


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న ప్రతినిధులు

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ ఎంసీహెచ్‌లో డెలివరీ సమయంలో వైద్యుల నిర్లక్ష్యంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న బాధిత మహిళను జాతీయ మానవహక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రతినిధులు కొండు జ్యోతి, చాడగొండ రమేష్ రెడ్డి, యాసారపు కరుణాకర్ మంగళవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత నెల 16వ తేదీ రాత్రి సమయంలో పట్టణానికి చెందిన ఆశ కార్యకర్త స్వప్న మూడో కాన్పు కోసం ఎంసీహెచ్‌కు వెళ్లడం జరిగిందన్నారు. డాక్టర్ ఆమెను పరీక్షించి, ఆపరేషన్ చేసే సమయంలో మూత్ర సంబంధిత పేగును కోయడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుందన్నారు. వెంటనే ఇద్దరు వైద్యులను పిలిపించి, శస్త్ర చికిత్స చేయించారన్నారు. ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై బాధితురాలి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకోవడం జరిగిందని, దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, సంతృప్తి లేదన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో మాట్లాడారు. ఆరో తరగతితో పాటు 7 నుంచి 10వ తరగతుల వరకు కూడా పలు ఖాళీలు ఉన్నాయని ఆ సీట్లను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్లు ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు..

దేవరుప్పుల: పదో తరగతి ఉత్తీర్ణులై చదువుకోని వారు ఒకే సంవత్సరంలో ఓపెన్ ఇంటర్ విద్యనభ్యసించే అడ్మిషన్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్వీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ తెలిపారు. ఈ నెల 11వ తేదీలోపు ఆసక్తి కలిగిన వారు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ విభాగాల్లో తెలుగు, ఇంగ్లిషు మీడియంలో అడ్మిషన్ పొందవచ్చని, మరిన్ని వివరాలకు 98499 66009, 85550 91124 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి


టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు

లింగాలఘణపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం మండలంలో కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న మండల స్థాయిలో 27న జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించబడే చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థులు పాల్గొనే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు పద్మ, అరుంధతి, శ్రీదర్, కరుణ, నిరంజనితోపాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


చేపల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: నాబార్డు ఆర్థిక సహకారంతో మారి సంస్థ ద్వారా అందజేస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండలో నాబార్డు ఆర్థిక సహకారంతో మారి సంస్థ ద్వారా చేపట్టిన చేపల పెంపకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడారు. మహిళా రైతులకు చేపల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి వారికి జీవనోపాధి కల్పించేలా ఉదయ్ ఆక్వా కనెక్షన్స్ సంస్థ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ తాటికొండలో చేపల పెంపకం చేపట్టడం సంతోషకరమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని ఆయన సూచించారు. నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ సంవత్సరంలో 240 మంది మహిళలకు రూ.4 లక్షల ఆదాయాన్ని కల్పించేలా చేపల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలాల రైతులకు మారి సంస్థ ద్వారా ఈ అవకాశం కల్పించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏపీజీవీబీ జనరల్ మేనేజర్ రాజయ్య, మారిసంస్థ వ్యవస్థాపకులు రామిశెట్టి మురళి, ఉపసర్పంచ్ మారపాక రాములు, మారపాక వెంకటస్వామి, బొంకూరి యాదగిరి, శ్రీనివాస్, వసంత్, రాజు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలికి చెక్ పవర్


సర్పంచ్, వార్డుసభ్యులతో సువర్ణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ నాల్గో వార్డు సభ్యురాలు దుబ్బాక సువర్ణకు కో సిగ్నేచర్ చేసేలా చెక్ పవర్ కల్పిస్తూ మంగళవారం ఏకగ్రీవంగా నిర్ణయించారు. సర్పంచ్ పోకల శివకుమార్ జైలులో ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు చట్టం ప్రకారం ఆయన చెక్ పవర్ తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప సర్పంచ్ యాద రాములు తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా నిధుల విడుదలలో ఆటంకాలు ఎదురుకాకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ కార్యదర్శి కవిత సమక్షంలో వార్డు సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి వార్డు సభ్యురాలు దుబ్బాక సువర్ణను కో సిగ్నేచర్ చేసేలా ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ముగ్గురు బాలకార్మికుల తరలింపు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో గల శ్రీశివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులను జఫర్‌గఢ్‌లోని ప్రజాదరణ ఆశ్రమానికి తరలించినట్లు చైల్డ్ వెల్ఫేర్ డివిజన్ అధికారి బి.స్వప్నరాణి, ఘన్‌పూర్ ఎస్సై హరికృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీశివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌ను చైల్డ్ వెల్ఫేర్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. కాటన్ ఇండస్ట్రీస్‌లో బీహార్‌కు చెందిన 18 ఏళ్ల లోపు వయసున్న ముగ్గురు కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈవిషయమై ఇండస్ట్రీ నిర్వాహకులను విచారిస్తే సరైన సమాధానం చెప్పలేదని, దాంతో శ్రీశివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలకార్మికులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి జఫర్‌గఢ్‌లోని ప్రజాదరణ ఆశ్రమానికి తరలించినట్లు పేర్కొన్నారు. బాలలచే పనిచేయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కానిస్టేబుళ్లు దేవరాజు, రాజ్‌కుమార్, ఆరిఫ్ ఉన్నారు.

‘విశ్వకర్మ యోజన’ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న రాజు

బచ్చన్నపేట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శీలంకోటి రాజు కోరారు. మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో విశ్వకర్మ యోజన బంధు నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అందరూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాథ స్వామి పుష్పయాగం


పుష్పయాగం చేస్తున్న అర్చకులు, భక్తులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో గోదారంగనాథ స్వామి ఆలయంలో పుష్పయాగాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయాన్నే ఆలయంలో పూజారులు జనార్దనాచార్యులు, కౌసల్ బాలాజీ ఆధ్వర్యంలో గోదారంగనాథస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన పూజ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పూజారులు వివిధ రకాల పూలతో స్వామి వారికి పుష్పాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు పూజలు నిర్వహించిన స్వామి వారికి మొక్కులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త నెల్లుట్ల వకులాదేవి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాద పద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లో సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత పాల్గొన్నారు.

మహాదేవస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న ఉపేందర్ దంపతులు

రఘునాథపల్లి: మండలకేంద్రంలోని మహాదేవస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్–రేణుక దంపతుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మండప దీపారాధన, హోమం నిర్వహించారు. అనంతరం వేద పండితులు పిండిప్రోలు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణలు, మేళ తాళాలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం కల్యాణ వేడుకను తిలకించి తరించారు. ఈ సందర్భంగా భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓరుగంటి శంకర్‌లింగం, పోకల లింగయ్య, సోమేశ్వర్, చింతకింది కృష్ణమూర్తి, వేదకుమార్, వినయ్‌కుమార్, బచ్చు చిరంజీవులు, లింగయ్య, రాజేశ్వర్, రమ, జ్యోతి పాల్గొన్నారు.

భవనాన్ని పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న గిరిజన హాస్టల్ భవనాన్ని పూర్తి చేసి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవినాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి ప్రేమకళకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ నియోజకవర్గంలో బాలుర ఆశ్రమ పాఠశాలలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఆమె స్పందిస్తూ సమస్యను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్టు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



జఫర్‌గఢ్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, తిమ్మంపేట, జఫర్‌గఢ్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులు నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. సీతారామయ్య, జి సురేష్‌కుమార్‌రెడ్డి, దయాసాగర్, లిల్లిమేరి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవి, మంజుల, సోమయ్య, శ్రీనివాస్, గిరిజ ఉన్నారు.

అంతర్జాతీయ తెలుగు మహా సభల్లో అవార్డులు


అవార్డు అందుకుంటున్న కవులు

పాలకుర్తి: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జరిగిన అంతర్జాతీయ స్థాయి తెలుగు మహా సభల్లో పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన ఇద్దరు కవులను ఘనంగా సన్మానించారు. రాజమండ్రిలో 5, 6, 7 తేదీల్లో తెలుగు మహా సభల వేదికపై బమ్మెర గ్రామస్తులు మాన్యం భిక్షపతి, దేవసాని ఉపేందర్‌లు చేసిన గానాన్ని ప్రశంసించారు. నారాయణ బట్టు వేదికపై కవితా గానం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు ఉమ్మడిగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సభలో అద్భుతమైన గానం చేసిన కవులను అభినందించారు.